తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత, బీసీ సంఘాల నేతలు

బీసీలకు తీరని అన్యాయం

- స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు పెంచాలి
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- 3న ఇందిరాపార్క్ బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ
- సర్పంచుల సంఘం జేఏసీ, విద్యార్థి జేఏసీ మద్దతు
- జిల్లాల నుంచి భారీ స్పందన.. తరలివచ్చేందుకు సిద్ధం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఈ ఏడాది పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 3న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె ఆవిష్కరించారు. అనంతరం కవిత మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఏడాది గడిచినా బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీ మహాసభకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు. బీసీ మహాసభకు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యార్థి జేఏసీతోపాటు వివిధ ప్రజా, కుల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బీసీల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితకు తాము మద్దతుగా ఉంటామని సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రకటించారు. తాము పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరవుతామని, తమ హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ మహాసభ పోస్టర్‌ను తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రదర్శించింది. ఎమ్మెల్సీ కవిత నిర్వహించే బీసీ మహాసభకు పెద్ద ఎత్తున తరలివస్తామని తెలంగాణ ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పడిగే ప్రశాంత్ ముదిరాజ్ ప్రకటించారు. ముదిరాజ్‌లకు ఉచిత చేప పిల్లలు పంపిణీ తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి బీసీ కుల సంఘాల నేతలంతా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని బీసీ కుల సంఘాల రాష్ట్ర నాయకుడు గుంజ పడుగు హరిప్రసాద్ తెలిపారు. కవిత నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొల్లా శివశంకర్, పెంటా రాజేశ్, సుంకోజు కృష్ణమాచారి, ఆలకుంట్ల హరి, కుమారస్వామి, విజేందర్‌సాగర్, రాచమల్ల బాలకృష్ణ, కోళ్ల శ్రీనివాస్, సాల్వాచారి, మురళి, నిమ్మల వీరన్న, లింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారుడి నైపుణ్యం

- పట్టుచీరలో రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, కలర్లు
- భూదాన్ పోచంపల్లి నేతన్న భరత్ ఘనత

భూదాన్ పోచంపల్లి, జనవరి 1: భూదాన్ పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు సాయిని భరత్ పట్టుచీరను కళాత్మకంగా తయారు చేసి అందరిని అబ్బుర పరిచాడు. ఓవైపు కట్టుకుంటే ఒక కలర్, మరోవైపు కట్టుకుంటే మరో కలర్ కనిపిస్తుంది. డిజైన్లు కూడా వేర్వేరుగా ఉంటాయి. రెండున్నర సంవత్సరాలు శ్రమించి, 15 రోజులపాటు మగ్గంపై చీరను నేశాడు. సాధారణంగా ఒక ఇక్కత్ చీరకు పైమర్ల, కింది మర్ల ఒకటే కలర్, డిజైన్ కనిపిస్తుంది. కానీ ఇది ప్రత్యేకం. ఈ చీరకు ఉల్టా పల్టా ఉండదు. ఈ చీరను తయారు చేసినందుకు పేటెంట్ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటికే ఈ చీరను చూసి పలువురు అబ్బురపడ్డారు. ఆయన కళాత్మకతను చూసి అభినందించారు. పోచంపల్లిలోని ప్రముఖ కళాపునర్వి యూనిట్ కూడా సాయి భరత్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు.

చేనేత కళాకారుడు సాయిని భరత్ తయారు చేసిన చేనేత పట్టు చీర

అన్నం పెట్టే రైతుకే షరతులా?

మొదటిపేజీ తరువాయి...

గతంలో అడిగిన రేవంత్‌కు ఇప్పుడు మతి మరుపు వచ్చినట్టున్నదని, ప్రతిపక్షంలో నాలుకకు నరం లేనట్టే మాట్లాడిన రేవంత్, ఇప్పుడు మాట మారుస్తున్నారని ఎద్దేవాచేశారు. 11 విడతల్లో రూ.73 వేల కోట్ల రైతుబంధును అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి దరఖాస్తు లేకుండా ఇచ్చిందని గుర్తుచేశారు. తమ మట్టా రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తున్నదని, రైతులను మళ్లీ పైరవీకారుల చుట్టూ తిరిగించేలా చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లాలో హరీశ్ బుధవారం పర్యటించారు. న్యాల్‌కల్ మండలం రేజింతల్ సిద్ధివినాయక ఆలయ జాతర వేడుకలు, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. సదాశివపేటలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజకు హాజరయ్యారు. అనంతరం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

భరోసాలో కోతలకు కుట్ర

ఒక్కసారి రైతుభరోసా ఇచ్చేందుకు కూడా రేవంత్ అపసోపాలు పడుతున్నారని హరీశ్ ఎద్దేవాచేశారు. భరోసాపై 4న క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని చెప్తూనే షరతులు విధించి పరిమిత సంఖ్యలో రైతులకు వర్తింపజేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని చూస్తుండటం దారుణమని, బడా పారిశ్రామికవేత్తలు, కంపెనీల వేలకోట్ల అప్పును రైటాఫ్ చేస్తున్న సర్కార్, రైతుల వద్దకు వచ్చేసరికి షరతులు పెట్టడం ఏమిటని నిలదీశారు. రైతులకు బేడీలు వేసి అవమానించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుభరోసా విషయంలో రైతులను నేరస్తులుగా చూడటం దారుణమని నిప్పులుచెరిగారు. రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పడమంటే తిరిగి రైతులు కాంగ్రెస్ నాయకుల చుట్టూ, పైరవీకారుల చుట్టూ తిప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఒక్కసారికే ఇస్తమంటే కుదరదు..

'పదెకరాలు ఉంటే రైతుభరోసా ఇవ్వం.. ఒకే పంటకు ఇస్తం.. సాగుభూమి ఉంటేనే ఇస్తం.. అని ప్రభుత్వం లీకులు ఇవ్వటం విడ్డూరంగా ఉన్నది. ఏడునెలలు సాగు చేసే పత్తి, పసుపు, అల్లం, చెరుకు, కంది రైతులకు ఒక్కసారికే రైతుభరోసా ఇస్తమంటే కుదరదు' అని హరీశ్ హెచ్చరించారు. ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా పత్తి సాగవుతుందని, 50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేసే దళిత, గిరిజన, బీసీ రైతులకు భరోసా ఒక్కసారికే ఇస్తామనడమంటే వారి పొట్టగొట్టడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కేసీఆర్ రైతుబంధును విజయవంతంగా అమలు చేశారని, రైతు గౌరవాన్ని కేసీఆర్ పెంచితే వారిని కాంగ్రెస్ అడుక్కునేలా చేస్తున్నదని ఫైర్ అయ్యారు. వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్నవిధంగా రైతులకు, పండ్లతోటలు సాగు చేసే రైతులందరికీ ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా ఇవ్వాలన్నారు. పత్తి, కంది, హార్టికల్చర్ రైతులకు అన్యాయం చేస్తామంటే ఊరుకునేది లేదని, రైతుభరోసా అందరికీ వర్తింపజేయకుంటే రైతులోకం తిరగబడుతుందని, తర్వాత పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీల వడపోత

వ్యవసాయకూలీలకు ఇస్తామన్న రూ.12 వేలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టేందుకు కుట్రలు పన్నుతున్నదని హరీశ్ విమర్శించారు. ఇందులోనూ లబ్ధిదారులను వడపోసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 1.04 కోట్ల మంది వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. 'వడపోతలు, పరీక్షలతో కూలీలను అవమానిస్తరా? కూలీలకు వెలకడ్తరా? ఇదేం పద్ధతి?' అని నిలదీశారు.

క్రైమ్‌లో తెలంగాణ ఎల్లోజోన్

కేసీఆర్ పాలనలో పదేండ్ల పాటు క్రైమ్ రేటులో గ్రీన్‌జోన్‌లో ఉన్న తెలంగాణ, రేవంత్ ఏడాది పాలనలోనే ఎల్లోజోన్‌లోకి వెళ్లిందని హరీశ్ మండిపడ్డారు. త్వరలోనే రెడ్‌జోన్‌లోకి వెళ్లే ప్రమాదం కూడా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. దక్షిణాదిరాష్ట్రాల్లో తెలంగాణ ఒక్కటే ఎల్లోజోన్‌లో ఉన్నదని చెప్పారు. నాడు క్రైమ్ డిటెక్షన్‌లో దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు బీహార్ కంటే వెనకబడిందని వాపోయారు. రాష్ట్రంలో క్రైమ్‌రేటు గతేడాది కంటే 23 శాతం పెరిగినట్టు చెప్పారు. లైంగికదాడుల కేసులు 29 శాతం, దళితులు, గిరిజనుల మీద లైంగికదాడుల ఘటనలు 12 శాతం పెరిగినట్టు తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో క్రైమ్ డిటెక్షన్ ఎక్కువగా ఉండటంతో కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర పోలీసులు ఇక్కడికి వచ్చి అధ్యయనం చేసేవారని గుర్తుచేశారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ పోలీసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు వినియోగించుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్రోలింగ్ వ్యవస్థ, డయల్ 100 వ్యవస్థ దెబ్బతిన్నదని తెలిపారు. కేసీఆర్‌కు పోలీసు వాహనాలు, పోలీస్టేషన్‌కు నెలనెల రూ.50 వేల అలవెన్స్ ఇచ్చారని గుర్తుచేశారు. రేవంత్ పాలనలో పోలీసుల టీఏ ఏడు రోజులకు తగ్గించారని, సరెండర్ లీవుల డబ్బులు మూడు క్వార్టర్స్‌వి చెల్లించాల్సి ఉన్నదని, స్టేషన్ అలవెన్సు డబ్బుల కోసం సెక్రటేరియట్‌లో పైరవీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, పోలీసులకు హెల్త్ కార్డులపై ప్రైవేట్ హాస్పిటళ్లు చికిత్స చేయటంలేదని, ఈ కార్డులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ కుటుంబం నుంచి వచ్చానని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ఏక్ పోలీసింగ్‌పై మాటమార్చారని, ఏక్ పోలీసింగ్ అమలు చేయాలని కోరిన టీజీఎస్పీ పోలీసులు పది మందిని డిస్మిస్ చేశారని, 39 మందిని సస్పెండ్ చేశారని ఇది దుర్మార్గమని మండిపడ్డారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, శివకుమార్, కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, మందుల వరలక్ష్మి, మఠం భిక్షపతి, శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

> 10 పంటలకు బోనస్ అన్నరు. ఒక్క వరికే అదీ సన్నాలకే ఇస్తమన్నరు. 5 పైసలిచ్చి 95 పైసలు ఎగ్గొట్టిండ్రు. వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి యాసంగికి షరతులు పెడుతున్నరు. పంటల బీమా గుండుసున్నా.. వ్యవసాయ పనిముట్లు ఇస్తామన్నరు అదీ సున్నా.. పాడి రైతులకు 5 రూపాయల ప్రోత్సాహం ఇస్తమని గాడిద గుడ్డు చేసిండ్రు. 24 గంటల కరెంట్ అని చెప్పి 16 గంటలు కూడా ఇస్తలేరు. రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటైనా నెరవేల్చిండ్రా?
>
> -హరీశ్‌రావు

నంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

> వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాలి. వానకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి ఎకరానికి రూ.15 వేల చొప్పున అందించాలి. పత్తి, చెరుకు, పసుపు పంటలకు ఒక్కసారికే రైతు భరోసా ఇస్తమంటున్నరు. కొండలు, గుట్టలు సాగుచేసే గిరిజన రైతులకు రైతు భరోసా రాదంటున్నరు. గిరిజన రైతులంటే మీకు గిట్టదా? రైతుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ కాపాడితే, మీరు ఇలా చేయడమేంటి?
>
> -హరీశ్‌రావు

> రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటరట! అబద్ధాలు చెప్తే శిక్షకు సిద్ధమని రాయాల్నట! ఇది అన్యాయం. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు ఎలాంటి షరతులు ఉండవు. వేలకోట్ల అప్పులు మాఫీ చేస్తరు. అందరికీ అన్నం పెట్టే రైతులకు మాత్రం షరతులు పెడుతున్నరు. ఈ ప్రభుత్వం రైతులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నది? ఇది దారుణం. షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నాలు చేయొద్దు.
>
> -హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనలో అన్నీ కోతలే

కోతలు తప్ప రైతులకు కాంగ్రెస్ ఇచ్చిందే మీ లేదని హరీశ్ ఎద్దేవాచేశారు. రేవంత్ సర్కా ర్ సగం మంది రైతులకే రుణమాఫీ చేసిందని, పది రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కేవలం సన్న బియ్యానికే అంటే 5 శాతమే ఇచ్చిందని, రైతుభరోసా అమలులోనూ షరతులు విధించి సగం మందికే వర్తించేలా కుట్ర చేస్తున్నదని, పంటల బీమా పథకాన్ని ఇంకా ప్రారంభించలేదని, వ్యవసాయ పనిముట్లు ఇవ్వలేదని, 24 గంటల కరెంట్ పేరిట 16 గంటలే ఇస్తున్నారని నిప్పులు చెరిగారు. కేంద్రం విడుదల చేసిన రూ.858 కోట్ల ఈజీఎస్ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కేటాయింపులు చేయలేదని చెప్పారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- దౌల్తాబాద్ కేజీబీవీ పీఈటీ అనితకు గుండెపోటు
- సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాదయ్య

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి ఆగ్రహం వ్యక్తంచేశారు. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదనే మనోవేదనతో సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ కేజీబీవీ పీఈటీ డీ అనితకు దీక్షా శిబిరంలో గుండెపోటు వచ్చిందని బుధవారం ఆయన ప్రకటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. తమ డిమాండ్లకు పరిష్కారం లభించడంలేదనే బాధతో ఇప్పటికే ముగ్గురు ఉద్యోగులు చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను రెగ్యులరైజ్ చేస్తూ పేస్కేల్ అమలు చేయాలని, తమ డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

సాగర్ ఎడమ కాల్వలో ఇద్దరు ఇంజినీర్ల గల్లంతు

- మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద ఘటన

మిర్యాలగూడ రూరల్, జనవరి 1: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని ఐలాపురం గ్రామం వద్ద బుధవారం నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాల్వలో పడి ఇద్దరు ఇంజినీర్లు గల్లంతయ్యారు. మిర్యాలగూడ రూరల్ ఎస్సై-2 సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టర్ కింద పనిచేసే ఉత్తరప్రదేశ్‌కు చెందిన 8మంది ఇంజినీర్లు బొలెరో వాహనంలో ఎడమ కాల్వ వద్దకు వచ్చారు. స్నానం చేసేందుకు కాల్వలోకి దిగారు. ఇద్దరు ఇంజినీర్లు కార్తీక్ మిశ్రా (24), విజయ్ గోస్వామి (25) నీటి ప్రవాహానికి కాల్వలో కొట్టుకుపోయారు. తోటి ఇంజినీర్లు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అనంతరం 100 నంబర్‌కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా ఆచూకీ లభించలేదని ఎస్సై తెలిపారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు.. ఢిల్లీకి మూటలు

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మితిమీరిపోయిన అవినీతి
- కాంగ్రెస్ అంటేనే కమీషన్ల ప్రభుత్వం
- హస్తం సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి
- ఫీజు బకాయిలు చెల్లించకపోతే బీహార్ తరహా ఉద్యమం
- రేపు కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్‌వో కార్యాలయాల ముట్టడి
- 5న బీసీ విద్యార్థుల బహిరంగ సభ
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, జనవరి 1: కాంగ్రెస్ పాలకులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. ఢిల్లీకి మూటలు పంపుతున్నారే తప్ప విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమని జోస్యం పలికారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్‌పై ఆయన నిప్పులు చెరిగారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను హస్తం పార్టీ చిన్నచూపు చూస్తున్నదని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు విద్యార్థులకు కల్లబొల్లి కబుర్లు చెప్పి, ఓటుబ్యాంకుగా ఉపయోగించుకొని నేడు వారిని గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని ఉద్యమాలు చేసినా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని, హాస్టళ్లకు సొంత భవనాలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్‌వో కార్యాలయాల ముట్టడి, 5న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆయా కార్యక్రమాలను విజయవంత చేసి కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేశ్, నందగోపాల్, రవియాదవ్, రాజు నాయక్, నిమ్మల వీరన్న, మోదే రామ్‌దేవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం విద్యుత్తు కేంద్రంలో లీకేజీ

- ఒకటో యూనిట్ వద్ద నీటిధారలు
- ప్రమాదం లేదన్న ప్రాజెక్టు సీఈ

అచ్చంపేట, జనవరి 1: నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రం వద్ద వారం రోజులుగా నీరు లీక్ అవుతున్నది. యూనిట్-1 జీరో ఫ్లోర్ డ్రాఫ్ట్ ట్యూబ్ నుంచి నీటి ధార పడుతున్నది. ఈ విషయాన్ని గత నెల 25న షిఫ్ట్ అధికారులు గుర్తించి పైఅధికారులకు సమాచారమిచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు వివరించగా.. హైదరాబాద్ విద్యుత్తు సౌధ నుంచి జనరల్ సర్వీసెస్ సివిల్ సీఈ హైడల్ నారాయణ వచ్చి పరిశీలించారు. లీకేజీకి సంబంధించి నివేదిక ఇవ్వాలని ఇంజినీర్లను ఆదేశించి.. లీకేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అయితే రివర్స్ విద్యుత్తు ఉత్పత్తి చేయడంతో వైబ్రేషన్ కారణంగా నీటి ఒత్తిడి పెరిగి లోపల ఉన్న పైపు వెల్డింగ్ నుంచి లీకేజీ కొనసాగుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. సర్జిచాంబర్, పెన్‌స్టాక్ గేట్లను మూసివేసి, టర్బయిన్‌లో నిల్వ ఉండే నీటిని పూర్తిగా తొలగించి లోపలికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. నాగార్జున సాగర్‌లో వాటర్ లెవల్ తగ్గితేనే పరిశీలించే అవకాశం ఉన్నదని ఎస్ఈ (సివిల్) రవీంద్రకుమార్ తెలిపారు. ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేదని, కాంక్రీట్‌కు వెల్డింగ్ చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. చిన్న నీటిధారతో ఎలాంటి ప్రమాదం లేదని, రివర్స్ పంపింగ్ విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశామని ఈఈ రామసుబ్బారెడ్డి తెలిపారు.

శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రంలోని యూనిట్-1 డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ వద్ద లీకేజీ

ఆర్‌పీలకు నిలిచిపోయిన వేతనాలు

- 7 నెలల నుంచి చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం
- వెంటనే చెల్లించాలంటూ ఆందోళనలు
- ఇందిరా పార్కువద్ద ధర్నా
- గౌరవ వేతనం పెంపునకు డిమాండ్

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పట్టణ పేదరిక నిర్మూలన పథకం (మెప్మా) రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)లకు గత 7 నెలల నుంచి జీతాలు నిలిచిపోయాయి. దీనిపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా వేతనాలు విడుదల చేయడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నాకు దిగారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, కనీస గౌరవ వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలని, పీఆర్పీని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆర్‌పీల డిమాండ్లు ఇవీ..

- ఏడు నెలల నుంచి పెండింగ్‌లో వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.
- కనీస గౌరవ వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలి.
- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) వీవోఏల మాదిరిగా పీఆర్సీ అమలు చేయాలి
- వీఎల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్‌పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలన్న నిబంధనలను తొలిగించాలి.
- రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్‌ను అమలు చేయాలి.
- మరణించిన ఆర్‌పీల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించాలి.

రక్షణ సంస్కరణల సంవత్సరంగా 2025

న్యూఢిల్లీ, జనవరి 1: రక్షణ రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలను చేపట్టబోతున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. భారత రక్షణ రంగానికి 2025 సంస్కరణల సంవత్సరంగా పేర్కొన్నది. బుధవారం కేంద్రం రక్షణ రంగంలో తీసుకొస్తున్న మార్పులపై కీలక ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు ప్రత్యేక కమాండ్స్ వేర్వేరుగా ఉండగా, 'థియేటరైజేషన్ ప్లాన్' కింద త్రివిధ దళాల సైనికులను ఒక యూనిట్‌గా మార్చి..'థియేటర్ కమాండ్స్'ను ప్రవేశపెట్టబోతున్నారు.

ఉరేసుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో బలవన్మరణం

మలక్‌పేట, జనవరి 1: కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ జటావత్ కిరణ్(36) ఆస్మాన్‌గఢ్ ఎస్టీ బస్తీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన కిరణ్ నిత్యం భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా నాలుగు రోజులు ముందుగానే లీవ్ పెట్టాడు. బుధవారం ఉదయం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకున్నాడు. ఆ తర్వాత ఇంటి నుంచి వారిని బయటకు పంపి తలుపులు వేసుకున్నాడు. గతంలో కూడా పలుమార్లు వీరిని ఇలాగే బయటకు పంపించి తలుపులు వేసేవాడు. ఈసారి కూడా అలా చేయడంతో వారు ఇరుగు, పొరుగు ఇండ్లలో ఉండి భోజనం కోసం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో కిరణ్ తలుపులు ఎంతకీ తీయలేదు. కిటికిలోంచి తొంగి చూడగా, కిరణ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కుటుంబసభ్యులు వెంటనే ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే కిరణ్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీకి చెప్పకుండానే కాలేజీ షిఫ్ట్

- ఉన్నపళంగా విద్యా సంవత్సరం మధ్యలో తరలింపు
- త్వరలో ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు..
- ఆందోళనలో భువ